సాక్షి
కామారెడ్డి
బుధవారం । 18 । అక్టోబర్ । 2023



దుర్గమ్మకు పూజలు
శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు.
- 11లో ▸



నీళ్ల కోసం ధర్నా
తాగు నీటి కోసం అన్నాసాగర్ తండా వాసులు ఆందోళన చేశారు. సమస్య పరిష్కరించాలని కోరారు.
- 11లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.1 /19.1
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

సిద్ధరామేశ్వరాలయ హుండీ లెక్కింపు



భిక్కనూరు: మండలంలోని శ్రీసిద్దరామేశ్వ రాలయం హుండీని మంగళవారం లెక్కించారు. జూలై 5 నుంచి ఇప్పటివరకు భక్తులు హుండీలో రూ. 4,61,889 సమర్పించారు. హుండీ లెక్కింపున దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఈవో శ్రీధర్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి, డైరెక్టర్లు బాలకృష్ణ, బస్వయ్య, శ్రీనివాస్, నీలంరెడ్డి, రాజయ్య, సిద్దరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: సెట్విన్, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు 50శాతం ఫీజు రాయితీతో వివిధ ఉపాధి కోర్సుల్లో 3 నెలల శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని కామారెడ్డి సెంటర్ ఇన్‌చార్జి సయ్యద్ మోహిజుద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ ఆఫీస్, అకౌంట్స్ ప్యాకేజీ, టైలరింగ్ ఫ్యాషన్ డిజైన్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మెహందీలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన వారు ఇతర వివరాలకు 73861 80456, 79891 59121 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డిని పరామర్శించిన కేటీఆర్



వేల్పూర్ : మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ ఇటీవల మరణించగా, ఆయనను మంగళవారం మంత్రి కేటీఆర్ మంగళవారం వేల్పూర్‌లో పరామర్శించారు. మంజులమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ప్రశాంత్‌రెడ్డికి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఆర్మూర్ ఎమ్మెల్యే, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, ఐడీహెచ్‌ఎఫ్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, నాయకులు కోటపాటి నర్సింహనాయుడు, ఇతర నాయకులు ఉన్నారు.

లక్కీ డ్రా పొడిగింపు

ఖలీల్‌వాడి : దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రయాణికులకు కోసం నిర్వహిస్తున్న లక్కీ డ్రాను పొడిగిస్తున్నట్లు ఆర్‌ఎం జానీ రెడ్డి తెలిపారు. ఈనెల 21 వరకు 30 వరకు మధ్య ప్రయాణించే వారికే లక్కీ డ్రా పాల్గొనే అవకాశముండగా, ఈ గడువును 18వ తేదీ నుంచి 30వ తేదీ నుంచి ముందుకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైరల్ ఫీవర్..!

ఉమ్మడి జిల్లాను విషజ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. ఇంట్లో ఒకరికి జ్వరం వచ్చిందంటే చాలు.. క్రమంగా అందరికీ అంటుకుంటోంది. నెలన్నరగా ఇదే పరిస్థితి.. సామాన్యులే కాదు ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా జ్వర పీడితుల జాబితాలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు వైరల్ ఫీవర్ బారిన పడ్డారు. కొందరు కోలుకోగా, ఇంకొందరు జ్వరాలతో బాధపడుతున్నారు.

- ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులను వెన్నాడుతున్న జ్వరాలు
- రాజకీయ నేతలకు పరీక్షగా మారిన అనారోగ్యం



సాక్షి, కామారెడ్డి: జ్వరాలతో జనం మంచం పడుతున్నారు. కొందరు ఇంటి వద్దనే ఉండి మందులు వాడి ఆరోగ్యాన్ని బాగు చేసుకుంటుండగా.. మరికొందరు ఆస్పత్రుల్లో చేరాల్సి వస్తోంది. రాజకీయ నాయకులు కూడా జ్వరాలతో బాధపడుతున్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఇటీవల వైరల్ ఫీవర్ బారిన పడి రెండు మూడు రోజులు ఇబ్బంది పడ్డారు. ముందే ఖరారు చేసుకున్న కొన్ని కార్యక్రమాలను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. కోలుకున్న తర్వాత ఆయా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్టు కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సైతం వైరల్ ఫీవర్ బారిన పడి కోలుకున్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ కూడా జ్వరంతో బాధపడుతూ హైదరాబాద్‌లో రెస్ట్ తీసుకుంటున్నారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ కూడా జ్వర బాధితుల జాబితాలో చేరారు. ఇంటికి వస్తున్న వివిధ గ్రామాల ప్రజలు, కార్యకర్తలతో మాట్లాడి పంపిస్తున్నారు. పది రోజుల క్రితం బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి కూడా వైరల్ ఫీవర్ బారిన పడి కోలుకున్నారు. పక్షం రోజుల క్రితం ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి ప్రశాంత్‌రెడ్డి వైరల్ ఫీవర్‌తో నాలుగైదు రోజులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడేకన్నా ముందు ఆయన తీవ్ర జ్వరంతోనూ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. చాలా కార్యక్రమాల్లో మాస్కు ధరించి పాల్గొన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కూడా ఇటీవల అనారోగ్యంతో రెండు మూడు రోజులు ఆస్పత్రిలో చికిత్సపొంది డిశ్చార్జి అయ్యారు. అలాగే మరికొందరు నాయకులు కూడా వైరల్‌ఫీవర్స్‌తో ఇబ్బంది పడుతున్నారు.

అనారోగ్యంతో అవస్థలు..

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జ్వరాలతో నేతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓవైపు ఎన్నికలను ఎలా ఎదుర్కొనాలన్న టెన్షన్, మరోవైపు జ్వరాలు వారిని పీడిస్తున్నాయి. రోజుల తరబడిగా జ్వరాలు, దగ్గు, జలుబు వదలడం లేదు. ఈ సమస్యలతో ప్రచారం కోసం జనంలోకి వెళ్లాలన్నా, పాదయాత్రగా ఇంటింటికి వెళ్లాలన్నా ఇబ్బందే.. ఎన్నికలు లేకుంటే వారం, పది రోజులు రెస్ట్ తీసుకునేవారమని, కీలకమైన సమయం కావడంతో ప్రచారంలోకి వెళ్లక తప్పడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

'రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే'



బాన్సువాడలో మాట్లాడుతున్న చింతల రామచంద్రారెడ్డి

బాన్సువాడ రూరల్: తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, దీనికోసం ప్రజలంతా ఎదురు చూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బాన్సువాడలోని పీఆర్ గార్డెన్‌లో బీజేపీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీ ఇచ్చిన ప్రతిహామీని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నెరవేర్చారన్నారు. ప్రజలు మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, దేశ ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ మాయమాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. నెలన్నరపాటు బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ బాన్సువాడ అసెంబ్లీ ప్రభారి నరసింహారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ భాస్కర్, నియోజకవర్గ ఇన్‌చార్జి మాల్యాద్రిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, నాయకులు లక్ష్మీనారాయణ, దొర బాబు, శ్రీనివాస్, గంగాధర్, శంకర్‌గౌడ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించాలి

మద్నూర్: ఈసారి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రజలను కోరారు. మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ జుక్కల్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పేర్లు మార్చి తమ పథకాలుగా చెప్పుకుంటూ కేసీఆర్ పాలన కొనసాగించారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పి, బీజేపీని గెలిపించాలని కోరారు. భారతీయ జనతా పార్టీని ప్రజలు అక్కున చేర్చుకొని ఆశీర్వదించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార విజ్ఞప్తి చేశారు. కార్యాక్రమంలో పార్టీ నాయకులు కాంచన కృష్ణ, రాము, ఆయా మండలాల అధ్యక్షులు, శక్తి కమిటీల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

రాహుల్ పర్యటన రూట్‌మ్యాప్ పరిశీలన

ఖలీల్‌వాడి : ఏఐసీసీ సెక్రెటరీలు ఉషానాథ్, రోహిత్‌చౌదరి మంగళవారం ఈనెల 20న ఏఐసీసీ మాజీ అధ్యక్షులు, ఎంపీ రాహుల్‌గాంధీ పాదయాత్ర రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. రాజరాజేంద్ర చౌరస్తా నుంచి అజాంరోడ్డు, నెహుపార్క్, గాంధీచౌక్, ఆర్పీ రోడ్డు నుంచి తిలక్‌గార్డెన్ వరకు పాదయాత్ర కొనసాగుతుంది. అనంతరం రాహుల్‌గాంధీ టూర్‌ను విజయవంతం చేయాలని కాంగ్రెస్ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశంలో కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలని కాంగ్రెస్ నేతలకు ఆదేశించారు. కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హుందాన్, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఏఐసీసీ కార్యదర్శులతో మాట్లాడుతున్న తాహెర్ బిన్ హుందాన్

'పండుగను ఆనందంగా జరుపుకోవాలి'



దుస్తులు అందజేస్తున్న చంద్రమోహన్

కామారెడ్డి క్రైం: దసరా పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవా లని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలోని 7 నిత్యావసర సరకుల గోదాములలో పనిచేస్తున్న 73 మంది హమాలీలు, ఏడుగురు స్వీపర్లకు దసరా కానుక అందించారు. కానుక కింద స్వీట్ బాక్స్‌తోపాటు రూ. 6,500 చొప్పున బోనస్, రెండు జతల దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర సరఫరాల సంస్థ ఏటా ఎంఎల్‌ఎస్ పాయింట్‌ల హమాలీలు, స్వీపర్లకు బోనస్‌తో పాటు స్వీట్ బాక్సులు, దుస్తులను అందజేస్తోందన్నారు. అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ అభిషేక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యూహాలకు పదును

ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలకు బీఆర్‌ఎస్ నేతలు పదును పెడుతున్నారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీ చేసే కామారెడ్డి నియోజకవర్గ బాధ్యతలు చూస్తున్న ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ బుధవారం నియోజకవర్గ ముఖ్య నేతలతో భేటీ కానున్నారు. ఆయన నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై సమీక్షిస్తారు. నేతలు, క్యాడర్ మధ్య ఉన్న విభేదాలపైనా సమీక్షించి సమన్వయం కుదిర్చే అవకాశాలున్నాయి.

- నేడు కామారెడ్డిలో గులాబీ నేతలతో భేటీ కానున్న కేటీఆర్
- బూత్ కమిటీలపై సమీక్షించి దిశానిర్దేశం చేయనున్న మంత్రి
- నేతల మధ్య సమన్వయం కుదిర్చే అవకాశం



సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకుగాను బూత్ స్థాయిలో వంద మంది ఓటర్లకు ఒక నాయకుడు ఇన్‌చార్జిగా ఉండేలా బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఇటీవల జరిగిన సభలో మంత్రి కేటీఆర్ నేతలను ఆదేశించారు. ఒక్కో బూత్‌లో పది మందికి బాధ్యత ఇవ్వాలని సూచించారు. దీంతో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల నేతలతో సమావేశం ఏర్పాటు చేసి బూత్ కమిటీల ఏర్పాటు కోసం చర్యలు చేపట్టారు. గ్రామాల వారీగా నేతలకు బాధ్యతలు ఇచ్చారు. 266 బూత్‌లకు పది మంది చొప్పున 2,660 మంది పేర్లతో జాబితాలను రూపొందించారు. బుధవారం నిర్వహించే సమావేశంలో కేటీఆర్ ఈ జాబితాపై నేతలతో సమీక్షించే అవకాశాలున్నాయి. ఆయన బూత్ కమిటీల్లోని సభ్యులు చేయాల్సిన కార్యక్రమాల గురించి దిశానిర్దేశం చేయనున్నారు. ఇదే సమయంలో నేతల మధ్య నెలకొన్న విభేదాలు, ఆధిపత్య పోరుపైనా కేటీఆర్ చర్చించి సమన్వయం కుదురుస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కేటీఆర్ పర్యటన నేపథ్యంలో నియోజకవర్గ మరో ఇన్‌చార్జి షేరి సుభాష్‌రెడ్డి మంగళవారం కామారెడ్డికి వచ్చారు. కేటీఆర్ నిర్వహించే సమావేశంపై పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్‌తో చర్చించారు. ఎన్నికలను ఎదుర్కొనేందుకు కేటీఆర్ సమావేశం అత్యంత కీలకమైనదిగా భావిస్తున్నారు.

మేనిఫెస్టోతో జనంలోకి..

కామారెడ్డి నియోజకవర్గంలో ఇప్పటివరకు బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం మొదలుకాలేదు. ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందువరకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ నియోజకవర్గంలోని ఆయా మండలాలను చుట్టి వచ్చారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలలో పాల్గొన్నారు. షెడ్యూల్ ప్రకటించడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో అధికారిక కార్యక్రమాలు నిలిచిపోయాయి. ఇపుడు ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై చర్చించి దిశానిర్దేశం చేయడానికి మంత్రి కేటీఆర్ నేతలతో సమావేశమవుతున్నారు. ఇప్పటివరకు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతో పాటు తిరిగి అధికారంలోకి రాగానే చేపట్టే కొత్త కార్యక్రమాలకు సంబంధించిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లేలా మంత్రి కేటీఆర్ నేతలకు దిశానిర్దేశం చేస్తారని తెలుస్తోంది.

నెలాఖరులో ధాన్యం కొనుగోళ్లు

- కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ఈనెల చివరివారం నుంచి కొనుగోలు చేయనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్‌లో అధికారులు, రైస్ మిల్లర్లతో మంగళవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 2,92,105 ఎకరాల్లో రైతులు వరి పండించారన్నారు. దాదాపు 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకు అనుగుణంగా సింగిల్ విండోల ఆధ్వర్యంలో 325, ఐకేపీ ఆధ్వర్యంలో 22 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికలకు సమాంతరంగా ధాన్యం కొనుగోళ్ల సీజన్ వచ్చిందన్నారు. అధికారులు ఎన్నికల కోడ్ అమలు చేస్తూ జాగ్రత్తగా పనిచేయాలని సూచించారు. కేంద్రాల ఏర్పాటుకోసం ఇప్పటినుంచే సన్నద్ధం కావాలన్నారు. తేమను కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, కాంటాలు, టార్పాలిన్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. గన్నీ సంచులను అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు నాణ్యత ప్రమాణాలకనుగుణంగా వడ్లను కేంద్రాలకు తెచ్చి మద్దతు ధర పొందేలా రైతు వేదికల ద్వారా అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. జిల్లాలో 39 బాయిల్డ్, వంద రా రైస్ మిల్లులు ఉన్నాయని, ధాన్యాన్ని తూకం వేసి ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం రవాణాకు అవసరమైన లారీలు అందుబాటులో ఉంచి మిల్లులకు ట్యాగింగ్ చేయాలన్నారు. మిల్లర్లు పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని హమాలీల కొరత రాకుండా చూసుకోవాలన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చెక్‌పోస్ట్‌ల వద్ద గట్టి నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. రైతులు కూడా సంయమనం పాటించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ అభిషేక్ సింగ్, జిల్లా సహకార అధికారి సింహాచలం, డీఏవో భాగ్యలక్ష్మి, మార్కెటింగ్ అధికారి రమ్య, డీటీవో వాణి, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు లింగం తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం కేంద్రం పరిశీలన



ఈవీఎం, ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం, ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పాటిల్ మంగళవారం సందర్శించారు. కౌంటింగ్ కేంద్రంలో ఫర్నిచర్, ఇతర వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించడానికి అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఎన్నికల విభాగం అధికారి ప్రేమ్ కుమార్, అధికారులు ఇందిరా ప్రియదర్శిని, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎస్పీ సుడిగాలి పర్యటన

- పలు పోలీస్ స్టేషన్ల తనిఖీ
- డబ్బు, మద్యం అక్రమ రవాణాకు చెక్‌పెట్టాలని సూచన

కామారెడ్డి క్రైం: సాధారణ ఎన్నికల నేపథ్యంలో బదిలీపై కామారెడ్డి జిల్లాకు వచ్చిన ఎస్పీ సింధు శర్మ.. మంగళవారం జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. ఎస్పీగా పోస్టింగ్ ఇవ్వగానే విధుల్లో చేరిన ఆమె.. జిల్లా స్వరూపం, పోలీస్ స్టేషన్‌లు, కేసుల పరిశోధన, అధికారుల పనితీరు, సమస్యాత్మక ప్రాంతాలు, ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు, బందోబస్తు చర్యలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా మంగళవారం ఆమె జిల్లాలోని సరిహద్దు చెక్ పోస్టులతో పాటు పలు పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఎన్నికల వేళ తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తలపై పోలీసులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయడంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

సరిహద్దులలో చెక్‌పోస్టులు..

కామారెడ్డి జిల్లా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులను కలిగి ఉండడంతో ఎన్నికల వేళ మద్యం, నగదు, నిషేధిత పదార్థాలు, వస్తువులు జిల్లాకు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వాటికి అడ్డుకట్ట వేయడానికి ఇప్పటికే సరిహద్దుల్లోని మద్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సలాబత్‌పూర్, జుక్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోపూర్ వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటల పాటు అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఆయా చెక్‌పోస్ట్‌లను ఎస్పీ సింధు శర్మ సందర్శించడంతో పాటు బాన్సువాడ సబ్ డివిజన్ పరిధిలోని నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్, జుక్కల్, మద్నూర్, బిచ్కుంద బీర్కూర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ పట్టణ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఆయా పోలీస్ స్టేషన్ల అధికారుల పనితీరును ఎస్పీ పరిశీలించారు. ఎక్కడా నిర్లక్ష్యానికి తావు లేకుండా విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.



మద్నూర్ మండలంలోని చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ సింధు శర్మ

సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచాలి

- పాత నేరస్తులను బైండోవర్ చేయాలి
- పోలీసులకు సూచించిన ఎస్పీ సింధు శర్మ

నిజాంసాగర్: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచాలని ఎస్పీ సింధు శర్మ ఆదేశించారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం సంగారెడ్డి –నాందేడ్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధులు, బందోబస్తు, తనిఖీలు, శాంతిభద్రతల పర్యవేక్షణను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి డబ్బు, మద్యం, దేశీదారు రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని, అవసరమైతే తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేయాలని సూచించారు. ఆమె వెంట బాన్సువాడ డీఎస్పీ జగన్నాథరెడ్డి, బాన్సువాడ రూరల్ సీఐ మురళి, ఎస్సై రాజశేఖర్, ఏఎస్సై రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఎడ్ల వెంకటేశ్‌కు కరాటే జడ్జి డిప్లొమా సర్టిఫికెట్ అందజేత



నిజామాబాద్‌నాగారం: నగరానికి చెందిన తెలంగాణ లీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కరాటే మాస్టర్ ఎడ్ల వెంకటేశ్ జడ్జి డిప్లొమా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈనెల 15న కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ రజనీష్ చౌదరి, టీఏఐఎస్‌కేడీ అసోసియేషన్ సంయుక్తంగా హైదరాబాద్‌లో 'జడ్జి, రిఫరీ సెమినార్ - ఎగ్జామినేషన్' నిర్వహించారు. తెలంగాణలోని ఆయా జిల్లాల నుంచి సుమారు 300 మంది కరాటే క్రీడాకారులు, మాస్టర్లు పాల్గొనగా, వెంకటేశ్, కార్తికేయ, వత్సన్, శ్రీనిష్, అనన్య ఉత్తమ ప్రతిభ కనబర్చి నేషనల్ జడ్జి డిప్లొమా సాధించారు.

పోలింగ్‌బూత్‌ల పరిశీలన



నిజామాబాద్‌రూరల్: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని తిర్మన్‌పల్లి, గుండారం, కాలూర్ గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్‌హెచ్‌వో మహేశ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్‌లలో ఓటర్లకు మౌలిక సదుపాయాల వివరాల గురించి బూత్‌లెవల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ జరిగే రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ టీవీలు అమర్చే విధంగా పోలింగ్‌బూత్‌లను ఏర్పాటుచేయాలని తహసీల్దార్ అనురుధ్‌ను కోరారు. వారివెంట సర్పంచులు, కార్యదర్శులు ఉన్నారు.

బాల్కొండ మండలంలో..

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్, బుస్సాపూర్, ఇత్వార్‌పేట్, జలాల్పూర్‌లోని పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు కనీస వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

వివాహిత అదృశ్యం

భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ మంగళవారం తెలిపారు. కొన్ని నెలుగా భార్యభర్తల మధ్య గొడలు జరగడంతో, ఈనెల 12న భార్య ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో భర్త ఆమె ఆచూకీ కోసం ఎంత వెతికిన కనిపించలేదు. ఈక్రమంలో మంగళవారం ఆయన భిక్కనూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఇందూరుకు 15వ ఎన్నిక

- రెండు సార్లు ఉప ఎన్నిక
- 1952లో ఏర్పడిన అర్బన్ నియోజకవర్గం
- అర్బన్‌లో ప్రాతినిధ్యం వహించిన అన్ని ప్రధాన పార్టీలు



డి. శ్రీనివాస్

సతీశ్‌పవార్

బిగాల

యెండల

ఖలీల్‌వాడి: జిల్లాలో ఎన్నికల సందడి మొదలైంది. 1952లో ఏర్పడిన అర్బన్ నియోజక వర్గం నాటి నుంచి నేటి వరకు నిర్వహించిన ఎన్నికల్లో ప్రజలు తమ అమూల్యమైన ఓటుతో ఉత్తమ నాయకుడిని ఎంపిక చేసుకుంటున్నారు. అర్బన్ నియోజకవర్గంలో నేటి ఎన్నికలతో కలిపి 15వ ఎన్నికలు జరగనున్నాయి. నాటి నుంచి అనేక పార్టీల అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. స్వతంత్రులు-3, బీజేపీ-2, కాంగ్రెస్-6, బీఆర్ఎస్-2 సార్లు విజయం సాధించి పాలన కొనసాగించాయి. అర్బన్‌లో రెండుసార్లు ఉప ఎన్నిక నిర్వహించారు. 1994లో టీడీపీ నుంచి సతీశ్‌పవార్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 2009-10లో నిర్వహించిన ఎన్నికల్లో బీజేపీ నుంచి యెండల లక్ష్మీనారాయణ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఉద్యమం తీవ్రతరం కావడంతో పదవీకి రాజీనామా చేసి 2010లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. బీజేపీకి నిజామాబాద్ గతంలో కంచుకోటగా ఉండేది. నగర కార్పొరేషన్‌లో 60 డివిజన్లు ఉన్నాయి. ఆర్మూర్ నియోజకవర్గం మాక్లూర్ మండల కేంద్రా

నికి చెందిన బిగాల గణేశ్ గుప్తా 2009లో బీఆర్ఎస్ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో 2014, 2018లో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. తాజాగా 2023 శాసనసభ ఎన్నికల్లో పార్టీ అధిష్టానం బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బిగాల గణేశ్ గుప్తాకు టికెట్‌ను కేటాయించింది. ఇంకా బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. 2018 ఎన్నికల్లో గణేశ్ గుప్తా కాంగ్రెస్ అభ్యర్థి తాహెర్‌బిన్‌హందాన్‌పై 25,841 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గణేశ్‌గుప్తాకు 71,896 ఓట్లు రాగా తాహెర్‌బిన్‌హందాన్‌కు 46,055 ఓట్లు వచ్చాయి. నాటి నుంచి నిజామాబాద్ నగర పాలక సంస్థ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలు హోరాహోరీగా పోటీ పడుతున్నాయి.

60 కార్పొరేషన్లలో..

గత ఎన్నికల్లో నిర్వహించిన 60 కార్పొరేషన్లలో 28 కార్పొరేషన్లు బీజేపీ అభ్యర్థులు గెలుపొందారు. కానీ మేయర్ స్థానాన్ని బీఆర్ఎస్ ఎంఐఎంతో జత కట్టి ఎక్స్‌అఫిసియో ఓట్లతో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. బీజేపీకి చెందిన 11 మంది కార్పొరేటర్లు ప్రస్తుతం బీఆర్ఎస్ తీర్థం తీసుకున్నారు. నియోజకవర్గంలో మున్నూరు కాపు, పద్మశాలీ, ముస్లిం మైనారిటీలు ప్రధాన సామాజిక వర్గాలు అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయిస్తాయి.

అర్బన్‌లో ఓటర్లు

పురుష ఓటర్లు	1,39,163
స్త్రీలు	1,47,571
ఇతరులు	32
మొత్తం ఓటర్లు	2,86,766

1952 నుంచి అర్బన్ నియోజకవర్గ రాజకీయ ప్రస్థానం

పదవీకాలం	ఎమ్మెల్యేగా గెలుపొందిన వారు	పార్టీ	పదవీకాలం	ఎమ్మెల్యేగా గెలుపొందిన వారు	పార్టీ
1952-57	మహ్మద్‌దావర్ హుస్సేన్	కాంగ్రెస్	1989-94	ధర్మపురి శ్రీనివాస్	కాంగ్రెస్
1957-62	మహ్మద్‌దావర్ హుస్సేన్	కాంగ్రెస్	1994-99	సతీశ్‌పవార్	టీడీపీ
1962-67	హరినారయణ్	స్వతంత్ర అభ్యర్థి	1999-04	ధర్మపురి శ్రీనివాస్	కాంగ్రెస్
1967-72	కేపీ గంగాధర్	స్వతంత్ర అభ్యర్థి	2004-09	ధర్మపురి శ్రీనివాస్	కాంగ్రెస్
1972-78	వి. చక్రధర్‌రావు	స్వతంత్ర అభ్యర్థి	2009-10	యెండల లక్ష్మీనారాయణ	బీజేపీ
1978-83	ఎ.కిషన్‌దాస్	కాంగ్రెస్	2010-14	యెండల లక్ష్మీనారాయణ	బీజేపీ
1983-85	డి.సత్యనారాయణ	టీడీపీ	2014-18	బిగాల గణేశ్ గుప్తా	బీఆర్ఎస్
1985-89	డి.సత్యనారాయణ	టీడీపీ	2018-24	బిగాల గణేశ్ గుప్తా	బీఆర్ఎస్

ఇజ్రాయిల్ నుంచి తెలంగాణకు..

- ఆపరేషన్ అజయ్‌లో భాగంగా స్వగ్రామాలకు యువత



ఇజ్రాయిల్ నుంచి తెలంగాణకు వస్తున్న యువకులు

ఆర్మూర్: ఇజ్రాయిల్, గాజా స్ట్రిప్‌లోని హమాస్ తీవ్రవాదుల మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో భారత ప్రభుత్వం చేపట్టిన అజయ్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ జిల్లాలకు చెందిన 11 మంది యువకులు మంగళవారం తమ స్వగ్రామాలకు బయల్దేరారు. ఇజ్రాయిల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న వీరికి తెలంగాణ ఇజ్రాయిల్ అసోసియేషన్ తరఫున వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా తెలంగాణ ఇజ్రాయిల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సోమ రవి మాట్లాడుతూ.. ఆపరేషన్ అజయ్‌లో భాగంగా వీరు ఇజ్రాయిల్ నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని పేర్కొన్నారు. ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర పలు దేశాలు వారి రాష్ట్రాలకు వెళ్లడానికి ప్రత్యేకంగా విమాన సదుపాయాలను కల్పించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు విమానాలు ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. స్వగ్రామాలకు వస్తున్న తెలంగాణ వారిలో రాచర్ల కనకయ్య (వేములవాడ), మారం మల్లికార్జున్, సామ వినోద్, బోడ డేవిడ్, గుగ్గిల్ల రాజు (నిజామాబాద్), అనుగందుల వెంకటి, అంగపల్లి శంకర్, సుద్దుల కిరణ్ కుమార్, తోట రవి, అడ్డారి గోపీ, ఎయిలెన్ ఉన్నారు.

హెచ్‌సీఏ జట్టు కెప్టెన్‌గా నితీశ్‌రెడ్డి



జక్రాన్‌పల్లి: మండలంలోని మనోహరాబాద్‌కు చెందిన పాట్కురి నితీశ్‌రెడ్డి రాష్ట్ర స్థాయి అండర్-23 హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ జట్టు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ నెల 26 నుంచి గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో నిర్వహించే టోర్నీలో నితీశ్‌రెడ్డి పాల్గొననున్నాడు. జక్రాన్‌పల్లి జడ్పీటీసీ సభ్యురాలు పాట్కురి తనుజాశ్రీనివాస్ రెడ్డి దంపతుల కుమారుడు నితీశ్‌రెడ్డి. హైదరాబాద్‌లోని ఇండస్ వరల్డ్ స్కూల్‌లో పాఠశాల విద్యను, భవన్స్ వివేకానంద కళాశాలలో నితీశ్‌రెడ్డి ఎంబీఏ పూర్తి చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో రాణిస్తున్న మహ్మద్ సిరాజ్, ఉత్తమ ఆటగాళ్లయిన తిలక్ వర్మ, తన్మయ్ అగర్వాల్, సీవీ మిలింద్ వంటి ముఖ్య ఆటగాళ్లతో కలిసి ఆడినట్లు నితీశ్‌రెడ్డి తెలిపాడు.

ట్రోఫీ గెలవడమే లక్ష్యం

అంతర్జాతీయ క్రికెట్‌లో రాణిస్తున్న క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్తున్నాను. తల్లిదండ్రుల ప్రోత్సాహం నాకు ఎప్పటికీ ఉంది. కోచ్ అద్నాన్ సహకారంతోనే క్రికెట్‌లో రాణించగలుగుతున్నాను. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కెప్టెన్‌గా ఎంపిక కావడం గర్వంగా ఉంది. అండర్-23 ట్రోఫీ గెలవడమే నా ముందున్న లక్ష్యం.

– నితీశ్‌రెడ్డి, హెచ్‌సీఏ జట్టు కెప్టెన్

కొనసాగుతున్న బతుకమ్మ సంబురాలు



బాన్సువాడలోని ఎస్ఎస్ఎల్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

బాన్సువాడ రూరల్/కామారెడ్డి రూరల్/సదాశివనగర్/తాడ్వాయి: జిల్లావ్యాప్తంగా బతుకమ్మ పండుగ సంబురాలు కొనసాగుతున్నాయి. పలు మండలాల్లో మంగళవారం మూడోరోజు మహిళలు బతుకమ్మలను రంగురంగు పూలతో పేర్చి, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు. అనంతరం మహిళలు, యువతులు నృత్యాలు చేస్తూ, బతుకమ్మ ఆడారు. అనంతరం స్థానిక చెరువులు, కుంటలలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. బాన్సువాడ మండలంలోని సోమేశ్వర్ శివారులో గల ఎస్ఎస్ఎల్ డిగ్రీకళాశాలో బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులు, అధ్యాపకులు బతుకమ్మలు పేర్చి కళాశాల ప్రాంగణంలో ఆడిపాడారు.సదాశివనగర్ మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డిలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ నిర్వహించారు.



గర్గుల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



అడ్లూర్ ఎల్లారెడ్డిలో..



తాడ్వాయిలో..

సరిహద్దులో నిఘా పెంచాలి

- కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ
- పలు పీఎస్‌ల తనిఖీ





సలాబత్‌పూర్ వద్ద తనిఖీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ, పిట్లంలో..

మద్నూర్/ నస్రుల్లాబాద్/ బిచ్కుంద/ పిట్లం/ ఎల్లారెడ్డి/ బాన్సువాడ రూరల్/ పెద్దకొడప్‌గల్: రాష్ట్ర సరిహద్దు అయిన సలాబత్‌పూర్‌లో పోలీసు సిబ్బంది నిఘా పెంచాలని ఎస్పీ సింధుశర్మ అన్నారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ వద్ద తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దును మంగళవారం ఎస్పీ పరిశీలించారు. మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల వారు ఈ రహదారి గుండా జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉందని సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి డబ్బు, మద్యం, మత్తు పదార్థాలు తరలకుండా నిఘా ఉంచాలన్నారు. ఎస్పీ వెంట బిచ్కుంద సీఐ కృష్ణ, ఎస్సై కృష్ణారెడ్డి, అధికారులు, సిబ్బంది ఉన్నారు. నస్రుల్లాబాద్‌లోని జిల్లా సరిహద్దు చెక్ పోస్టును ఎస్పీ సింధు తనిఖీ చేశారు. అనంతరం పీఎస్‌ను సందర్శించి సిబ్బంది పని తీరును పరిశీలించారు. డీఎస్పీ జగన్నాథరెడ్డి, ఎస్సై తిరుపతి ఉన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలోని పీఎస్‌ను ఎస్పీ సందర్శించారు. జాగ్రత్తగా విధులను నిర్వర్తించాలని సీఐ కృష్ణ, ఎస్సై మురళిని ఆదేశించారు. పిట్లం పీఎస్‌ను ఎస్పీ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సీఐ మురళి, జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై విజయ్ కొండ, సిబ్బంది ఉన్నారు. ఎల్లారెడ్డి పీఎస్‌ను ఎస్పీ తనిఖీ చేసి పలు విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీనివాస్, ఎస్సై గణేశ్ ఉన్నారు. బీర్కూర్ పీఎస్‌ను ఎస్పీ తనిఖీ చేసి రికార్డును పరిశీలించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ జగన్నాథరెడ్డి, రూరల్ సీఐ మురళి ఉన్నారు. పెద్దకొడప్‌గల్ పీఎస్‌ను ఎస్పీ సందర్శించారు. రహదారిపై వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. పీఎస్‌లో గ్రీనరీని చూసి ఎస్సై కోనారెడ్డి, సిబ్బందిని అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

మాక్లూర్: మండలంలోని వేణు కిసాన్‌నగర్ తండాకు చెందిన మాలోవత్ సుందర్ సింగ్ (36) కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో సోమవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధీర్ రావు మంగళవారం తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భిక్కనూరులో సైబర్ మోసం

భిక్కనూరు: పాన్‌కార్డ్ అప్‌డేట్ చేయించుకోవాలంటూ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేసి బ్యాంక్ ఖాతా పేరిట రుణం తీసుకుని నగదు బదిలీ చేసుకున్న ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గడ్డమీది ఓం ప్రకాశ్‌కు ఈనెల 11న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి పాన్‌కార్డ్ అప్‌డేట్ చేసుకోవాలని చెప్పి యాక్సిస్ బ్యాంక్ లింక్ పంపాడు. ఓం ప్రకాశ్ ఆ లింక్‌పై క్లిక్ చేసి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఖాతాను వారి ఆధీనంలోకి తీసుకొని ఖాతాలో ఉన్న రూ. ఎనిమిది వేల నగదుతో పాటు రూ. 8 లక్షల రుణాన్ని తీసుకొని ఖాతా నుంచి బదిలీ చేసుకున్నారు. తన బ్యాంక్ ఖాతా యాప్ పనిచేయడం లేదని ఓంప్రకాశ్ కామారెడ్డిలోని యాక్సిస్ బ్యాంక్‌కు వెళ్లి వివరాలు తెలుపగా ఈ మోసం గురించి తెలిసింది. వెంటనే బాధితుడు 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

తనిఖీలో నగదు పట్టివేత



రుద్రూర్/ఎల్లారెడ్డి/భిక్కనూరు/ కామారెడ్డి క్రైం/ మద్నూర్: కోటగిరి పీఎస్ పరిధిలోని పోతంగల్ చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలో ఒకరి నుంచి రూ.లక్షా39వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ మంగళవారం తెలిపారు. రుద్రూర్ మండలం అంబం గ్రామానికి చెందిన ఇందూర్ గగన్ నుంచి స్వాధీనం చేసుకున్న నగదుకు ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిలో వాహనాల తనిఖీల్లో రూ. 5,48,200 నగదు లభ్యమైనట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై గణేశ్ తెలిపారు. పట్టణ శివారులోని సోమార్‌పేట్ బైపాస్ వద్ద వాహనాల తనిఖీ చేపడుతుండగా మూడు కార్లలో రూ. 3,38,600, రూ. లక్ష, రూ.1,09,600 నగదు లభ్యమైందని ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తా వద్ద కారులో వెళ్తున్న ఒకరి నుంచి రూ. రెండు లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తిరుపయ్య, ఎస్సై సాయికుమార్‌లు తెలిపారు. నగదును ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ బైపాస్ వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.1.18 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ వద్ద రూ. 2.70 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ మహేశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్, హరిజనవాడ కాలనీల్లో నిర్వహిస్తున్న రెండు బెల్ట్ షాపులపై ఎక్సైజ్ సిబ్బంది, పట్టణ పోలీసులు మంగళవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. వరలక్ష్మి గార్డెన్ ప్రాంతంలో ఉన్న ఓ కర్రీ పాయింట్‌లో, హరిజనవాడలోని ఓ ఇంట్లో మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించి దాడులు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో దాదాపు రూ. 20వేలకు పైగా విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గ్రామాల్లో మద్యం స్వాధీనం

దోమకొండ/ధర్పల్లి/మోపాల్/నవీపేట: దోమకొండ మండలంలోని అంబారిపేటలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్ దాడి నిర్వహించినట్లు ఎస్సై మురళి తెలిపారు. దాడిలో మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ధర్పల్లి మండలంలోని నడిమి తండా, మరియా తండా, రేకులపల్లి గ్రామంలో బెల్ట్ షాపులపై పోలీసులు దాడి నిర్వహించారు. దాడిలో మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. మోపాల్ మండలంలోని కాల్‌పోల్‌లో రెండు బెల్ట్‌షాపులపై పోలీసులు దాడి చేశారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గంగాధర్ పేర్కొన్నారు. నవీపేట మండలంలోని పోతంగల్ శివారులో వాహనాల తనిఖీలో ఇద్దరి నుంచి 18 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ మంగళవారం తెలిపారు. పోతంగల్‌కు చెందిన లక్ష్మారెడ్డి, మల్కాపూర్‌కు చెందిన మజ్జిగ స్వామి నుంచి మద్యం లభ్యమైందని అన్నారు. మద్యాన్ని సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి



నరేశ్ (ఫైల్)

మోర్తాడ్: వరద కాలువలో పడి గల్లంతైన యువకుడి మృతదేహం మంగళవారం లభించిందని ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. మోర్తాడ్‌కు చెందిన బాస నరేశ్(33) సోమవారం కాలకృత్యాలు తీర్చుకునేందుకు వరద కాలువ వద్దకు వెళ్లగా అందులో పడి గల్లంతయ్యాడు. మృతుడి భార్య మేఘన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు, తల్లి ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి

రుద్రూర్(బాన్సువాడ): నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలో అనుమానాస్పద స్థితిలో ఓ లారీ డ్రైవర్ మరణించాడు. మృతుడిని సిద్దిపేట జిల్లా రేబర్తి గ్రామానికి చెందిన పిల్లి కండ్ల బాబు (40)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాబు ధాన్యం రవాణా కోసం లారీ తీసుకుని సోమవారం రుద్రూర్‌కు వచ్చాడు. పెట్రోల్ బంక్ సమీపంలో లారీని నిలిపాడు. మంగళవారం ఉదయం అటువైపు వెళ్లిన స్థానికులకు బాబు మృతదేహం కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు లారీపై ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి మృతుడి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న బాబుకు ఫిట్స్ రావడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై నీరేశ్ తెలిపారు.



బాబు మృతదేహం

బైక్‌ను ఢీకొన్న డీసీఎం

- ఒకరి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన బాధిత కుటుంబం (ఫైల్)

పిట్లం(జుక్కల్): బైకును డీసీఎం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన సంగారెడ్డి జిల్లా జంబిగే గేటు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న పిట్లం మండలం చిల్లర్గి గ్రామానికి చెందిన పండరి(36) మృతి చెందగా భార్య, కుమారులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పండరి భార్య వినోద, కుమారులు శ్రీహర్షిత్, శ్రీహన్షిత్‌తో కలిసి బైక్‌పై సంగారెడ్డి జిల్లా తడ్కల్ గ్రామంలోని తన అక్క దగ్గరికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా జంబి గేట్ వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో గాయపడ్డ పండరి కుటుంబ సభ్యులను అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పండరి మృతి చెందినట్లు తెలిపారు. అతని భార్య, కుమారులకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు.


తలమడ్లలో చోరీ

రాజంపేట: తలమడ్ల గ్రామంలోని ఓ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై సంపత్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన సాయవ్వ ఈ నెల 13న నిజామాబాద్‌లో ఉన్న తన సోదరుడి ఇంటికి వెళ్లింది. మంగళవారం వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. 50 తులాల వెండి, రూ.40 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితురాలి తెలిపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంపత్ పేర్కొన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని మల్లయ్యపల్లి గేట్ వద్ద మంగళవారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మెదక్ జిల్లా పాపన్నపేట్‌కు చెందిన సాయికుమార్ మెదక్ నుంచి ఎల్లారెడ్డికి వస్తుండగా, నాగిరెడ్డిపేట మండలం గోలిలింగాలకు చెందిన రామకృష్ణ తల్లి సావిత్రితో కలిసి ఎల్లారెడ్డి నుంచి స్వగ్రామానికి వస్తుండగా మల్లయ్యపల్లి శివారులో రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో సాయికుమార్, సావిత్రికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వృద్ధుడి అదృశ్యం



ఖలీల్‌వాడి: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొల్పూర్‌కు చెందిన ఆమెన్ల దేవన్న(65) అదృశ్యమైనట్లు ఒకటోటౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. దేవన్న మంగళవారం ఆస్పత్రి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

వాహనాలను పరిశీలించాలి



వర్ని: జిల్లా సరిహద్దు దాటుతున్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ సిబ్బందికి సూచించారు. వర్ని పీఎస్ పరిధిలోని మల్లారం శివారులో ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును మంగళవారం తనిఖీ చేశారు. ఎన్నికల సమయంలో ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏసీపీ వెంట సీఐ జితేశ్ రెడ్డి, ఎస్సై కృష్ణకుమార్ ఉన్నారు.